



EVENING EDITION

నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

గురువారం

01-01-2026


పేజీలు: 02





# సైక్ సిద్ధార్థ రివ్యూ

శ్రీ నందు హీరోగా నటించిన యూత్‌ఫుల్ డార్క్ కామెడీ డ్రామా 'సైకో సిద్ధార్థ'. ఈ చిత్రానికి హీరోగా మాత్రమే కాకుండా సహ రచయితగా, నిర్మాతగా కూడా శ్రీ నందు వ్యవహరించారు. న్యూ ఇయర్ స్పెషల్‌గా విడుదలైన ఈ సినిమా, చాలా సింపుల్ కథను గట్టిగా, క్విర్కీగా, కొంచెం సైకో టోన్‌లో చెప్పే ప్రయత్నం చేసింది. ఈ ప్రయత్నం ఎంతవరకు ఫలించిందో చూద్దాం. సిద్ధార్థ (శ్రీ నందు) వరుస మోసాలతో కుంగి పోయి ఉంటాడు. ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో మంచి పేరు తెస్తానని చెప్పిన మనోహర్ చేతిలో మోసపోతాడు. దీనికి తోడు, అతని ప్రేమికురాలు త్రిష (ప్రియాంక రెబెకా శ్రీనివాస్) కూడా అతన్ని వదిలేసి మనోహర్ వైపు నిలబడుతుంది. వరుసగా ఎదురైన దెబ్బలతో సిద్ధార్థ పూర్తిగా డిస్టర్బ్ అయి, సమాజానికి దూరంగా ఒంటరిగా జీవించడం మొదలుపెడతాడు. అదే సమయంలో, భర్త చేతిలో బాధపడుతున్న శ్రావ్య (యామిని భాస్కర్) తన భర్తను విడిచి అదే అపార్ట్‌మెంట్‌లో నివసించేందుకు వస్తుంది. ఒక అనుకోని సంఘటన వీరిద్దరినీ దగ్గర చేస్తుంది. అక్కడినుంచి వారి జీవితాలు మెల్లగా మారడం మొదలవుతుంది. గతం ఎలా వర్తమానంపై ప్రభావం చూపుతుంది? చివరికి వీరిద్దరి ప్రయాణం ఎటు దారి తీస్తుంది? అన్నదే మిగతా కథ. శ్రీ నందుకు ఇది పూర్తిగా తన సత్తా చూపించే పాత్ర. ఇప్పటివరకు సాఫ్ట్, ఫ్రెండ్‌లీ క్యారెక్టర్‌స్‌కే పరిమితమైన అతను, ఇక్కడ పూర్తిగా విరిగిపోయిన, కొంచెం పిచ్చి స్వభావం ఉన్న పాత్రలో పెద్ద రిస్క్ తీసుకున్నాడు. ఆ రిస్క్ అతని నటనలో స్పష్టంగా కనిపిస్తుంది. చాలా సన్నివేశాల్లో అతని ఫ్రస్ట్రేషన్, మెంటల్ కన్ఫ్యూజన్ బాగా వర్క్ అయ్యాయి. సెకండ్ హాఫ్‌లో యామిని భాస్కర్‌తో వచ్చే కాంబినేషన్ సీన్స్‌లో కొన్ని జెన్యూన్‌గా నవ్వించే మోమెంట్స్ ఉన్నాయి. కథకు కొంత రిలీఫ్ అందిస్తాయి. సిద్ధార్థ చిన్ననాటి స్నేహితుడు రేవంత్‌గా నటించిన సింహా ఎక్కడ కనిపించినా ఎనర్జీ పెంచాడు. అతని ఎక్స్‌ప్రెషన్స్, బాడీ లాంగ్వేజ్, షార్ప్ డైలాగ్ పంచ్‌లు సినిమాకి మంచి టెంపో తీసుకొచ్చాయి. డైరెక్టర్ నరేషన్ స్టైల్ సినిమాకి ప్రత్యేక ఆకర్షణ. చాలా పలుచని కథను విచిత్రమైన ఐడియాస్‌తో, పాప్-అప్ టెక్స్ట్లు, ఇంట్రెస్టింగ్ సౌండ్స్, క్విర్కీ కట్స్‌తో ప్రెజెంట్ చేశాడు. కొన్ని చోట్ల ఇది కామిక్ బుక్ స్టైల్ ఫీల్ ఇస్తుంది. రెండు గంటల రన్‌టైమ్ కూడా ప్లస్ పాయింట్, బోర్ కొట్టకుండా వేగంగా సాగుతుంది. సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ ఈ మ్యాడ్‌నెస్‌ను బాగా సపోర్ట్ చేశాయి. సింపుల్ కథను ఫంకీగా చెప్పాలన్న ప్రయత్నం చాలా చోట్ల అతిగా మారింది. సినిమా మొత్తం అరుపులు, ఒకదానిపై ఒకటి పడే డైలాగ్స్, అడల్ట్ కంటెంట్, కస్ వర్డ్స్‌తో నిండిపోయింది. మొదట నవ్వు తెప్పించిన ఈ శైలి, క్రమంగా రొటీన్ గా మారి అలసట తెప్పిస్తుంది. యామిని భాస్కర్ చాలా గ్యాప్ తర్వాత కనిపించినా, ఆమె పాత్ర పేపర్‌పై బాగున్నా స్క్రీన్‌పై పూర్తిగా క్లిక్ అవ్వలేదు. డైలాగ్ డెలివరీ కొన్ని చోట్ల తేడాగా అనిపిస్తుంది. ఎమోషనల్ సీన్స్ ఆశించినంత ఇంపాక్ట్ ఇవ్వలేకపోయాయి. మనోహర్, త్రిష వంటి పాత్రలకు సరైన డెప్త్ లేకుండా కేవలం కథను ముందుకు నడిపించే క్యారెక్టర్స్ గా మిగిలిపోయాయి. ఫస్ట్ హాఫ్ పేస్ బాగున్నా సరైన బిల్డప్ లేదు. సెకండ్ హాఫ్ కూడా అదే రిథమ్‌లో సాగుతుంది. హీరోలో మార్పు వచ్చినా కథ ఎమోషనల్‌గా లోతుగా వెళ్లదు. సినిమా స్మూత్‌గా నడిచినా, బయటకు వచ్చాక బలమైన ఫీలింగ్ మిగలదు. రా లాంగ్వేజ్, ఇంటిమేట్ సీన్స్, అడల్ట్ కంటెంట్ కారణంగా ఇది ఫ్యామిలీ ఆడియన్స్‌కు పూర్తిగా కనెక్ట్ కాదు. డైరెక్టర్ తాను చేయాలనుకున్న సినిమా విషయంలో చాలా క్లియర్‌గా ఉన్నాడు. వింత కట్స్, సౌండ్ ఎఫెక్ట్స్‌తో కథ చెప్పే ఐడియా కొత్తగా ఉన్నా, మరింత స్ట్రాంగ్ రైటింగ్, కంట్రోల్ ఉంటే ఫలితం ఇంకా బాగుండేది. కె. ప్రకాష్ రెడ్డి సినిమాటోగ్రఫీ సినిమా మూడ్‌కు సరిగ్గా సరిపోయింది. విజువల్స్ క్లీన్‌గా ఉన్నాయి. స్మరణ్ సాయి మ్యూజిక్ సినిమా నరేషన్‌కు మంచి ఫ్లేవర్ జోడించింది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కథను బాగా మోయగలిగింది. ప్రొడక్షన్ వాల్యూస్ డీసెంట్. ప్రతీక్ నూటి ఎడిటింగ్ చాలా చోట్ల షార్ప్‌గా ఉన్నా, ఇంకొంచెం ట్రిమ్ చేసి ఉంటే సినిమా ఇంకా క్రిస్ప్‌గా ఉండేది. మొత్తానికి 'సైక్ సిద్ధార్థ' స్టోరీ కంటే స్టైల్ మీద ఎక్కువగా ఆధారపడిన ఒక డిఫరెంట్ అటెంప్ట్. శ్రీ నందు నిజాయితీగల ప్రయత్నం, కొన్ని ఫన్నీ మోమెంట్స్ ప్లస్‌గా నిలిచినా.. లైట్ కథ, అతిగా సాగే నరేషన్, రా కంటెంట్ సినిమాను పరిమితం చేశాయి. ప్రయోగాత్మక, ఆఫ్‌బీట్ సినిమాలు ఇష్టపడే యూత్‌కు ఇది కనెక్ట్ కావచ్చు. కానీ ఫ్యామిలీ ఆడియన్స్ మాత్రం ఈ సినిమా చూడటం కష్టమే.




## చైనా వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించాలి

### ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలను తొలగించేందుకు తమ దేశం మధ్యవర్తిత్వం వహించిందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఆ వ్యాఖ్యలపై ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తన సోషల్ మీడియా పోస్టులో స్పందించారు. ఇండోపాక్ ఉద్రిక్తతలను తగ్గించినట్లు చైనా చెప్పడం అవమానకరమని, ఆ వ్యాఖ్యలకు కేంద్ర సర్కారు గట్టి బదులు ఇవ్వాలని అన్నారు. భారతీయ హుందాతనాన్ని, సార్వభౌమత్వాన్ని చైనా తక్కువ చేసి మాట్లాడడం సరికాదు అన్నారు. ఆపరేషన్ సింధూర్ వేళ ఇండోపాక్ మధ్య తీవ్ర సంక్షోభం నెలకొన్నదని, వాణిజ్య బెదిరింపులతో శాంతి నెలకొల్పినట్లు ట్రంప్ చెప్పారని, ఇప్పుడు చైనా మంత్రి కూడా ఇలాంటి ప్రకటన చేయడం భారత్‌ను కించపరచడమే అవుతుందని ఓవైసీ అన్నారు. చైనా వ్యాఖ్యలను భారత్ బలమైన రీతిలో వ్యతిరేకించాలన్నారు. భారత్, పాకిస్థాన్ దేశాలను ఒకే స్థాయిలో పెట్టి, దక్షిణాసియాలో మేటి దేశంగా మార్కులు కొట్టేసేందుకు చైనా ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. చైనా పర్యటనకు వెళ్లిన సమయంలో ప్రధాని మోదీ ఈ విషయాన్నే అంగీకరించారా అని నిలదీశారు. ఇండోపాక్ సమరాన్ని మధ్యవర్తిత్వం ద్వారా ఆపినట్లు చైనా చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం అధికారికంగా ఆ వ్యాఖ్యలను ఖండించాలని, మూడవ దేశం జోక్యం చేసుకోలేదన్న విషయాన్ని చెప్పాలని ఓవైసీ కోరారు.

## నంద్యాలలో దారుణం.. కన్న బిడ్డలను కడతేర్చిన తండ్రి

కడుపున పుట్టిన పిల్లలను తల్లిదండ్రులు ఎంతో అపురూపంగా చూసుకుంటారు. తమకు ఎంత కష్టం వచ్చినా కూడా బిడ్డలు సంతోషంగా ఉండాలనే కోరుకుంటారు. పిల్లల విషయంలో తండ్రి స్థానం ఎంతో గొప్పది. తమ బిడ్డల భవిష్యత్తు బాగుండాలని రెక్కలుముక్కలు చేసుకుని కష్టపడుతుంటాడు. అలాంటి తండ్రి.. పిల్లలకు ఒక హీరో అనే చెప్పుకోవాలి. కానీ.. ఇప్పుడు మనం చెప్పుకోబోయే తండ్రి మాత్రం పిల్లల విషయంలో ఎంతో కర్కశంగా ప్రవర్తించాడు. తన రెక్కల కింద దాచుకోవాల్సిన చిన్నారులను తనే పొట్టనబెట్టుకున్నాడు. ఆపై అతడూ దారుణానికి పాల్పడ్డాడు. నంద్యాల జిల్లాలో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే... నంద్యాల జిల్లా తొడుములదిన్నెలో దారుణం జరిగింది. కన్నబిడ్డలను అతి కిరాతకంగా చంపేశాడో తండ్రి. తన ముగ్గురు పిల్లలను కడతేర్చిన తండ్రి.. ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చనిపోయిన ముగ్గురు చిన్నారులు కావ్య(7), ధ్యానేశ్వరి(4), గగన్(2)లుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అసలు ముగ్గురు చిన్నారులను తండ్రి ఎందుకు చంపేశాడు? ఇందుకు గల కారణాలు ఏంటి? కుటుంబ కలహాలు ఏమన్నా ఉన్నాయా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## గచ్చిబౌలిలో యువకుడు అనుమానాస్పద మృతి

గచ్చిబౌలిలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం రాత్రి కొండాపూర్ శ్రీరాం నగర్ కాలనీ నుంచి బోటానికల్ గార్డెన్ వైపు.. పాలపిట్ట పార్క్ సమీపంలోని రహదారిపై శంకర్ (19) అనే యువకుడు నిర్జీవంగా పడి ఉన్నాడు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. అతడి జేబులోని సెల్ ఫోన్ ద్వారా అతని స్నేహితులకు సమాచారం ఇచ్చారు. స్నేహితులు వెంటనే పాలపిట్ట పార్క్ వద్దకు చేరుకుని శంకర్‌ను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అతడు అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. శంకర్ సోదరుడు పోలీసులను ఆశ్రయించాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శంకర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పాలపిట్ట పార్క్ సమీపంలో సీసీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. అతడి మృతి గల కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. మృతుడు శంకర్.. నగరంలోని ఒక ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నట్లు పోలీసులు గుర్తించారు.



## కొత్త ఏడాది బిగ్ షాక్.. భారీగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర

కొత్త ఏడాది తొలిరోజే వినియోగదారులకు చమురు మార్కెటింగ్ కంపెనీలు బిగ్ షాక్ ఇచ్చాయి. ఇప్పటికే పెరిగిన ధరలతో అల్లాడుతున్న సామాన్యులపై మరో భారం మోపాయి. దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగించే సిలిండర్ ధరను భారీగా పెంచాయి. 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ (LPG cylinder) ధరపై రూ.111 బాదాయి. ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబై, హైదరాబాద్ సహా అన్ని ప్రధాన మెట్రో నగరాల్లో కొత్త ధరలు నేటి నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించాయి. ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా ఇవాళ కూడా సవరించిన ధరలను ప్రకటించాయి. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1691.50కు పెరిగింది. కోల్‌కతాలో రూ.1,795, ముంబైలో రూ.1,642.50, చెన్నైలో రూ.1,849.50కి పెరిగింది. అయితే, కాస్త ఊరటనిచ్చే విషయం ఏంటంటే.. గృహ వినియోగం కోసం ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులూ చేయలేదు. గత కొన్ని రోజులుగా వీటి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధరల పెరుగుదల హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు వ్యాపారులపై మరింత భారం పడనుంది.

## విషాదాన్ని మిగిల్చిన న్యూ ఇయర్ వేడుకలు.. బార్‌లో భారీ పేలుడు.. అనేక మంది మృతి




నూతన సంవత్సర వేడుకలు శోకసంద్రంగా మారాయి. స్విట్జర్లాండ్‌లోని ప్రసిద్ధ లగ్జరీ స్కీ రిసార్ట్ పట్టణం క్రాన్స్-మోంటానాలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఒక బార్‌లో జరిగిన పేలుడు పెను విషాదాన్ని మిగిల్చింది. ఆ తర్వాత ఈ పేలుడు భారీ అగ్నిప్రమాదానికి దారితీసింది. అనేక మంది మరణించారు. ఇతరులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, విపత్తు నివారణ బృందాలు భారీగా చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా క్రాన్స్-మోంటానాలోని ఒక బార్‌లోకి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. ఈ సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి వెంటనే మంటలు వ్యాపించి భయాందోళనలకు గురిచేశాయి. రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రమాదంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తుంది. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. పేలుడుకు గల కారణాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

## న్యూ ఇయర్ వేడుకలో విషాదం.. బిర్యానీ తిని ఒకరు మృతి..15 మందికి అస్వస్థత

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 31 రాత్రి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ గ్రాండ్‌గా జరుపుకున్నారు. పబ్బులు, క్లబ్బులు, ఫామ్ హౌస్, రిసార్ట్స్ కొంతమంది సొంత రూముల్లో న్యూ ఇయర్ సంబరాలు చేసుకున్నారు. కొత్త ఏడాదిలో కొన్నిచోట్ల విషాదాలు చోటు చేసుకున్నాయి. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా బిర్యాని తిని ఒకరు మృతి చెందగా, 15 మంది తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషాద ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని భవానినగర్‌లో జరిగింది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా 17 మంది మద్యం సేవించి చిల్ అయ్యారు. బిర్యానీ తిన్న పాండు(53) అస్వస్థతకు గురై చనిపోయాడు. మరో 15 మంది అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వాళ్లందరినీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. ఇదిలా ఉంటే.. హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అనుమానితులను తనిఖీలు చేశారు. ఈ క్రమంలోనే నార్సింగ్‌లో డ్రగ్స్‌తో ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. రాజమండ్రికి చెందిన శ్రీనివాస్ కళ్యాణ్, గోవాకు చెందిన విజయ్ డ్రగ్స్ తీసుకున్నారని,వారిని టెస్ట్ చేయగా పాజిటీవ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

## కోతుల గుంపు దాడిలో మహిళ మృతి



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లింగాపూర్‌లో విషాదం నెలకొంది. కోతుల దాడిలో ఓ మహిళ తలకు దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల ప్రాకారం.. లింగాపూర్ గ్రామానికి చెందిన కేసిరెడ్డి విమల (59) ఇంట్లోకి బుధవారం ఉదయం కోతుల గుంపు వచ్చింది. కోతులు బీభత్సం సృష్టించడంతో.. ఆమె వాటిని పంపే ప్రయత్నం చేసింది. కానీ.. కోతులన్నీ ఎదురు తిరిగాయి. ఆమెపై దాడికి చేసే క్రమంలో విమల వెనక్కి పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయింది. గమనించిన స్థానికులు ఆమెను హుజురాబాద్ ఏరియా హాస్పిటల్ కు తరలించారు.. పరీక్షించిన వైద్యులు అప్పటికే.. ఆమె మృతి చెందిందని తెలిపారు. కాగా గత కొన్నాళ్లుగా ఆ గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. ఈ క్రమంలోనే.. గ్రామంలో మహిళ చనిపోవడంతో స్థానికులు మరింత భయపడుతున్నారు. నిత్యం.. కోతులు గుంపులు. గుంపులుగా వచ్చి ఇళ్లల్లోకి చొరబడుతున్నాయని.. దాడులు కూడా చేస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ కోతుల సమస్య నుంచి విముక్తి కల్పించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# న్యూ ఇయర్ స్పెషల్.. కొత్త సినిమా పోస్టర్‌లు

